సాక్షి
నిర్మల్

దీపావళి శుభాకాంక్షలు

సోమవారం । 20 । అక్టోబర్ । 2025

న్యూస్‌రీల్

జిల్లా ప్రజలకు ఎస్పీ దీపావళి శుభాకాంక్షలు



జానకీ షర్మిల

నిర్మల్‌టౌన్: జిల్లా ప్రజలు, పోలీస్ అధికారులు, సిబ్బందికి ఎస్పీ జానకీ షర్మిల శనివారం ఓ ప్రకటనలో దీపావళి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ పర్వదినాన ప్రతీ ఇంట్లో వెలుగులు, సంతోషం, శాంతి నిండాలని ఆకాంక్షించారు.

గజ్జలమ్మ దేవికి పూజలు



పూజలు చేస్తున్న భక్తులు

కుంటాల: మండల కేంద్రంలోని గజ్జలమ్మదేవి ఆలయంలో అర్చకులు శ్రీకాంత్ రామానుజదాస్, నగేశ్ ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. గజ్జలమ్మ, ముత్యాలమ్మ, మహాలక్ష్మి అమ్మవార్లకు అభిషేకం, అలంకరణ, అర్చన, హారతి తదితర పూజలు నిర్వహించగా భక్తులు అధికసంఖ్యలో హాజరయ్యారు. గజ్జలమ్మ పల్లకీ సేవలో భక్తులు పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదం పంపిణీ చేశారు.

జిల్లాస్థాయి పోటీలకు ఎంపిక

భైంసాటౌన్: పట్టణంలోని ఖేలో ఇండియా వుషూ కేంద్రంలో ఆదివారం జిల్లాస్థాయి రెజ్లింగ్ ఎంపిక పోటీలను ఎస్జీఎఫ్ జిల్లా కార్యదర్శి రవీందర్‌గౌడ్, కన్వీనర్ రమణారావు, ఆర్గనైజింగ్ సెక్రెటరీ ప్రవీణ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. అండర్–14 ఫ్రీ స్టైల్ విభాగంలో డీ కరణ్, అండర్–17లో బాలాజీ, రాంచరణ్, అయాజ్ ఖాన్, రామకృష్ణ, యోగేశ్వర్, సాయిప్రసాద్, షేక్ అర్బాస్, గ్రీక్ రోమన్ విభాగంలో రణవీర్, జాదవ్ శివానంద్, భగాజీ ఎంపికైనట్లు పేర్కొన్నారు. ఈ మేరకు క్రీడాకారులకు అభినందనలు తెలిపారు. వ్యాయామ ఉపాధ్యాయులు శ్రీనివాస్, సాయికృష్ణ, సాగర్, రాథోడ్ రాజు, జ్ఞానతేజ పాల్గొన్నారు.

శ్రమదానంతో శుభ్రత పనులు



గోదావరి ఘాట్‌ను శుభ్రం చేస్తున్న సభ్యులు

బాసర: బాసర శ్రీజ్ఞాన సరస్వతీ క్షేత్రంలో మహారాష్ట్రలోని దెగ్లూర్ ప్రాంతానికి చెందిన షేర్ స్వచ్ఛంద జాగర్ ఆధ్వర్యంలో 10మంది కార్యకర్తలు ఆదివారం స్వచ్ఛ కార్యక్రమం నిర్వహించారు. ఆలయంతో పాటు గోదావరి ఘాట్ పరిసరాలు శుభ్రం చేశారు. 11ఏళ్లుగా ప్రముఖ ప్రాంతాల్లోని పరిసరాలు పరిశుభ్రం చేస్తున్నట్లు సభ్యుడు సూర్యకాంత్ సువార్ణకార్ తెలిపారు. కాగా, వీరికి ఆలయ ఈవో అంజనాదేవి, ఆలయ అనువంశిక ట్రస్ట్ సభ్యుడు శరత్ పాఠక్ అభినందనలు తెలిపారు.

చెక్‌పోస్ట్‌లో ఏసీబీ తనిఖీలు



బెల్‌తరోడా సరిహద్దులోని చెక్‌పోస్ట్

తానూరు: మహారాష్ట్ర సరిహద్దులోని బెల్‌తరోడా చెక్‌పోస్ట్‌లో శనివారం అర్ధరాత్రి ఏసీబీ అధికారులు తనిఖీలు నిర్వహించారు. అర్ధరాత్రి ఒంటి గంట నుంచి ఉదయం 5గంటల వరకు కంప్యూటర్‌లోని లావాదేవీలు, జరిమానా వివరాలపై ఆరా తీశారు. ఎంవీఐ ఠాకూర్, ఈశ్వర్ సిబ్బందితోపాటు ఉదయం 5గంటల వరకు అక్కడే ఉండి అక్కడ ఏర్పాటు చేసిన డబ్బాలో డ్రైవర్లు స్వచ్ఛందగా వేసిన రూ.3వేల నగదు స్వాధీనం చేసుకున్నారు. దాడిలో సీఐలు, 10 మంది సిబ్బంది ఉన్నట్లు తెలిసింది.

దరఖాస్తు గడువు పొడిగింపు

నిర్మల్‌టౌన్: మద్యం దుకాణాల దరఖాస్తు గడువు ఈనెల 23వరకు పొడిగించినట్లు జిల్లా ఎక్సైజ్ శాఖ అధికారి అబ్దుల్ రజాక్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. చివరిరోజు రాష్ట్రబంద్ ఉండడంతో దరఖాస్తుదారులకు రవాణా, బ్యాంక్ సమస్యలు తలెత్తినందున ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలోని 47 మద్యం దుకాణాలకు శనివారం రాత్రి వరకు 942 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు.

మార్కెట్‌కు దీపావళి శోభ



మట్టి ప్రమిదలు కొనుగోలు చేస్తున్న మహిళలు



బంతిపూలు కొనుగోలు చేస్తూ..



పేనీలు కొనుగోలు చేస్తూ..

వెలుగులు విరజిమ్మే దీపావళి పండుగను ఆనందంగా జరుపుకొనేందుకు జిల్లా ప్రజలు సిద్ధమయ్యారు. సోమవారం పండుగ కాగా, ఇప్పటికే ఇంటింటా దీపాల వెలుగులతో సందడి నెలకొంది. జిల్లా కేంద్రంలోని మార్కెట్లు కొనుగోలుదారులతో కిటకిటలాడుతున్నాయి. వివిధ రకాల పూలు, అరటి చెట్లు, అందమైన ఆకృతుల్లో మట్టి ప్రమిదలు, పూజ సామగ్రి, పటాకులు, వస్త్ర దుకాణాలు జనాలతో కిక్కిరిసిపోతున్నాయి. – నిర్మల్‌టౌన్

పత్రికాస్వేచ్ఛను హరించొద్దు



లక్ష్మణచాంద: పత్రికాస్వేచ్ఛను హరించడమంటే ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమేనని లక్ష్మణచాంద ప్రెస్‌క్లబ్ సభ్యులు పేర్కొన్నారు. నిజాలను నిగ్గు తేలుస్తున్న 'సాక్షి' దినపత్రికపై ఆంధ్రప్రదేశ్‌లోని కూటమి ప్రభుత్వం కక్షసాధింపు చర్యలకు పాల్పడడాన్ని తప్పు పట్టారు. ఎడిటర్ ధనంజయరెడ్డి, పాత్రికేయులను అక్రమ కేసులతో వేధించడంపై మండిపడ్డారు. వెంటనే కేసులు ఎత్తివేయాలని డిమాండ్ చేశారు.

పునరావృతం కానివ్వొద్దు



నిజాలు వెలికితీస్తున్న 'సాక్షి' దినపత్రిక ఎడిటర్ ధనంజయరెడ్డిపై అక్రమంగా కేసులు పెట్టడం సరికాదు. పత్రికాస్వేచ్ఛకు భంగం కలిగించడం శోచనీయం. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలి.

– గోలి గంగాధర్, లక్ష్మణచాంద ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు

తప్పుడు కేసులు సరికాదు



పత్రికాస్వేచ్ఛను హరించడం సరికాదని సాక్షాత్తు దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీం కోర్టు చివాట్లు పెట్టినా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కేసులు పెట్టడం సరికాదు. ఎడిటర్, రిపోర్టర్లపై కేసులు వెంటనే ఎత్తి వేయాలి.

– కోరుకొప్పుల రాజాగౌడ్, లక్ష్మణచాంద ప్రెస్‌క్లబ్ ప్రధాన కార్యదర్శి

గంగ దాటని అభివృద్ధి

- మంజూరు కాని యూనివర్సిటీ
- కొత్త కళాశాలలకు మోక్షమేది?
- ఉన్న కాలేజీలో కొత్త కోర్సుల్లేవు
- ముందుకు కదలని రైల్వేలైన్
- పరిశ్రమల ఏర్పాటుపై చిన్నచూపు
- పెదవి విరుస్తున్న జిల్లావాసులు



నిర్మల్: 'అవ్ సార్.. మన జిల్లా తెలంగాణల లేదా..! లేకపోతే మన ప్రభుత్వాలు నిర్మల్ జిల్లాను మర్చిపోయినయా ఏంది..? అరె.. ఒక్కటంటే ఒక్క అభివృద్ధి పని కూడా జిల్లాకు అస్తలేదు. రోజు పేపర్ల సూస్తున్న.. ఏదో ఒక్క కాలేజో, పరిశ్రమనో, పదవో ఇస్తూనే ఉన్నరు. ఏది జూడు గంగవతల (గోదావరి అవతల)నే అస్తున్నయ్. ఒక్కటి కూడ మనదిక్కు ఇస్తలేరు. మరి.. ఏ పనైనా గంగ దాటద్దని గిట్ల సర్కారోళ్లు రూల్ పెట్టుకున్నరా.. లేక గీడ అడిగేటోళ్లు లేరని గిట్ల అనుకుంటున్నరా..!?' అని దిలావర్‌పూర్ మండలంలో టీస్టాల్ నడుపుకొనే నర్సయ్యలాంటి సామాన్యుడు కూడా జిల్లాకు జరుగుతున్న అన్యాయంపై అడుగుతున్నాడు. చాలామంది విద్యావంతులు, విద్యార్థులు, తల్లిదండ్రులూ ఇదే తరహాలో ప్రశ్నిస్తున్నారు.

పైచదువు కోసం గంగ దాటుడే..

చదువులతల్లి సరస్వతమ్మ కొలువైన జిల్లాలో ఉన్నతచదువులు ఇప్పటికీ అందని ద్రాక్షే. ఉన్న ఒక్క పీజీ కాలేజీనీ నామ్‌కేవాస్తేగా మార్చేశారు. ఇక ఉన్నతవిద్య కోసం గంగదాటి నిజామాబాద్, హైదరాబాద్, కరీంనగర్ లాంటి పట్టణాలకు వెళ్లాల్సిందే. కనీసం డిగ్రీ, పాలిటెక్నిక్ కాలేజీల్లోనూ కొత్త కోర్సులు, ఉపాధినిచ్చే విద్యను ప్రవేశపెట్టడం లేదు. పైచదువులు చదవాలంటే.. ఇంటికి దూరంగా, నెలనెలా అమ్మానాన్నలు పంపే డబ్బులపై ఆధారపడుతూ చదవాల్సిందే. ఈకారణంతోనే డిగ్రీ పూర్తయినా.. ఎంతోమంది పేద, మధ్యతరగతి విద్యార్థులు లోకల్‌గానే ప్రైవేట్ ఉద్యోగాలు చేస్తూ, ఉపాధి పొందుతూ ఇక్కడే ఆగిపోతున్నారు.

అన్నీ అంతే.. ఏదీ జిల్లాకు రాదు

పైచదువులొక్కటే కాదు.. జిల్లాకు అభివృద్ధిపరంగా ఏ ఫలమూ అందడం లేదు. అభివృద్ధి పనుల కేటాయింపుల్లో కేంద్రం, రాష్ట్రం రెండూ దొందుదొందే అన్నట్లు జిల్లాపై చిన్నచూపు చూస్తూనే ఉన్నాయి.

- జిల్లాకు వచ్చిన ఇథనాల్, ఆయిల్‌పామ్ రెండూ దాదాపు పోయినట్లే. ఈ పరిశ్రమలను ఎక్కడ పెట్టాలన్న విషయంపై సరైన స్పష్టత లేకపోవడం, రైతులు, ప్రజలకు ఇబ్బందులు కలిగించే ప్రాంతాలను ఎంపికచేయడంతో రెండూ జిల్లాను వీడనున్నాయి. కనీసం ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లనైనా జిల్లాకు కేటాయించడం లేదు.
- తరాలుగా ఎదురుచూస్తున్న జిల్లా మీదుగా రైల్వేలైన్ ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లు ఉంది.
- పర్యాటకపరంగా ఆకట్టుకునే ఎన్నో అందాలున్నా.. జిల్లా వైపు ప్రభుత్వాలు కనీసం కన్నెత్తి చూడటం లేదు.
- పరిశ్రమలు, విద్యాలయాలే కాదు.. రాజకీయంగానూ జిల్లాపై చిన్నచూపే.
- కేంద్రంలో ఉన్న ఎన్డీఏ, రాష్ట్రంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వాలు జిల్లా నుంచి ఒక్క నేతకూ ఓ స్థాయి ఉన్న పదవి ఇవ్వవు.
- గంగదాటితే పక్కనే ఉన్న నిజామాబాద్ జిల్లా నుంచి ముగ్గురికి కార్పొరేషన్ చైర్మన్ పదవులిచ్చారు. జిల్లాకు మాత్రం మొండిచేయి చూపుతున్నారు.

కొత్తవి ఒక్కటీ కేటాయించలే..

జిల్లాకు జ్ఞానసరస్వతీ యూనివర్సిటీ కావాలని ఎప్పటి నుంచో అడుగుతున్నా.. ఈ దిక్కు చూసే ధ్యాసే సర్కారుకు లేదు. ఇటీవల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పలు విద్యాలయాలు, అభివృద్ధి పనులను వరుసగా కేటాయిస్తుండగా ఒక్కటీ జిల్లాకు కేటాయించలేదు. రాష్ట్రంలో కొత్తగా హుజూర్‌నగర్, కొడంగల్, నిజామాబాద్‌లలో వ్యవసాయ కళాశాలల ఏర్పాటుకు మంత్రి మండలి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. కొత్త ఇంజినీరింగ్ కళాశాల హుస్నాబాద్‌లో, ప్రభుత్వ లా కాలేజీ కరీంనగర్‌లో ఏర్పాటు చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం 75 యంగ్‌ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లను ఏర్పాటు చేస్తూ జిల్లాకు మాత్రం మొండిచేయి చూపింది. కేంద్రం భద్రాద్రికొత్తగూడెం, జగిత్యాల, మహబూబ్‌నగర్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, నిజామాబాద్, సంగారెడ్డి, సూర్యాపేటకు జవహర్ నవోదయ విద్యాలయాలను మంజూరు చేసింది. కేంద్రం ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, వనపర్తి, జగిత్యాలకు కేంద్రీయ విద్యాలయాలు కేటాయించింది. కొడంగల్, సుల్తాన్‌పూర్‌లో జేఎన్‌టీయూ క్యాంపస్‌లలో సైన్స్ సెంటర్లు ఏర్పాటు చేస్తున్నారు. త్వరలో రామగుండంలో డెంటల్ కాలేజీ ఏర్పాటు చేయనున్నారు. ఇటీవల గంగాధర, ధర్మపురికి డిగ్రీ కాలేజీలు కేటాయించి ఖానాపూర్‌ను మర్చిపోయారు.

జిల్లాపై దృష్టిపెట్టాలి



కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్మల్ ప్రాంతంలో విద్య, వ్యవసాయ, పారిశ్రామిక రంగాలకు సంబంధించిన అభివృద్ధి కేటాయింపులు చేయాలి. జ్ఞానసరస్వతీ పేరిట నిర్మల్ కేంద్రంగా విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేయాలి.

– ఎంసీ లింగన్న, యూనివర్సిటీ సాధన సమితి కన్వీనర్

విద్యారంగంలో వెనుకబడి..



ఇప్పటికీ జిల్లా విద్యారంగంలో అత్యంత వెనుకబడి ఉంది. ఇప్పటికైనా ఇక్కడి పాలకులు దృష్టి పెట్టి ప్రభుత్వాలను ఒప్పించి నూతన విశ్వవిద్యాలయం, కాలేజీలు, కోర్సులను రప్పించాల్సిన అవసరముంది.

– వెంకటేశ్, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు

జిల్లాలో అన్నీ ఉన్నా..



జిల్లాలో సాగు, తాగు నీటికి ఎలాంటి కొదువ లేకుండా ఉంది. పచ్చని పంటలకు ఆలవాలం. విద్య, వైద్య, పారిశ్రామికంగా ఎదుగుదల లేదు. ఇక్కడ ఉపాధి లేకనే దూరదేశాలకు వలసలు పెరుగుతున్నాయి.

– పోలీస్ భీమేశ్, యువకవి, నిర్మల్

వేదవతి శిలకు దారేది..?



వేదవతి శిల



శిలకు వెళ్లే రహదారి ఇలా..

బాసర: శ్రీజ్ఞాన సరస్వతి అమ్మవారిని దర్శించుకుని.. చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించేందుకు నిత్యం వేల సంఖ్యలో భక్తులు బాసరకు వస్తుంటారు. దర్శనం అనంతరం బస్టాండ్ ఎదుట ఉన్న పురాతన వేదవతి శిల సందర్శనకూ వెళ్తుంటారు. ఈ వేదవతి శిలను మరో రాయితో కొడితే అమ్మవారి సప్తస్వరాలు చెవిలో వినిపిస్తాయని భక్తులు పేర్కొంటున్నారు. కానీ, వేదవతి శిల దగ్గరకు వెళ్లేందుకు సరైన మార్గం లేదు. ప్రస్తుతం శిల చుట్టూ పిచ్చిమొక్కలు, ముళ్లపొదలే ఉన్నాయి. ఆలయ అధికారులు స్పందించి పరిసరాలు శుభ్రం చేసి సీసీ రోడ్డు నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.

కనువిందు చేస్తున్న కలువలు



చెరువులో పూసిన తామరలు

నర్సాపూర్ (జీ): మండలంలోని చాక్‌పల్లి గ్రామంలోని చెరువు ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పూర్తిగా నిండిపోయింది. 61వ జాతీయ రహదారి పక్కన చెరువులో పూసిన తామర పూలు చూపరులకు కనువిందు చేస్తున్నాయి.

బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడిగా సురేశ్



ఎన్నిక పత్రం తీసుకుంటున్న సురేశ్

ఖానాపూర్: తెలంగాణ ఫెడరేషన్ ఆఫ్ బార్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా మంత్రరాజం సురేశ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం హైదరాబాద్‌లోని నాంపెల్లిలోగల మెట్రోపాలిటన్ క్రిమినల్ కోర్టు కాంప్లెక్స్‌లో రాష్ట్ర కార్యవర్గ ఎన్నికలు జరిగాయి. తెలంగాణ వ్యాప్తంగా ఉన్న బార్ అసోసియేషన్ల అధ్యక్షులు పాల్గొని ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఈ ఎన్నికల్లో ఓటు వినియోగించుకున్న ఖానాపూర్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సురేశ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఎన్నిక కాగా, స్థానిక న్యాయవాదులు అభినందనలు తెలిపారు.

పక్కాగా పంటల లెక్క

- ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు
- రైతుల ప్రయోజనం కోసమే..



వద్యాల్‌లో పంటల వివరాలు నమోదు చేస్తున్న ఏఈవో మౌనిక (ఫైల్)

లక్ష్మణచాంద: కొనుగోలు కేంద్రాల్లో పంట దిగుబడులు విక్రయించేందుకు రైతులు ఇబ్బందులు పడకుండా వ్యవసాయశాఖ ప్రత్యేక చర్యలు చేపట్టింది. రైతులు సాగు చేస్తున్న వివిధ పంటలు, సాగు విస్తీర్ణం తదితర వివరాలు అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లి డిజిటల్ పద్ధతిలో ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఆదేశించింది. ఈ మేరకు జిల్లాలోని 19మండలాల్లోని 400 గ్రామాల్లో రైతులు సాగు చేస్తున్న పంటల వివరాలను ఏఈవోలు నమోదు చేస్తున్నారు.

3,66,430 ఎకరాల వివరాలు నమోదు

జిల్లా వ్యాప్తంగా ఏఈవోలు తమ క్లస్టర్ల పరిధిలోని గ్రామాల్లో క్షేత్రస్థాయికి వెళ్లి రైతులు సాగు చేస్తున్న పంటల వివరాలు నమోదు చేస్తున్నారు. ఏఈవోలు ప్రతీ పంట ఫొటో తీసి మొబైల్ యాప్‌లో పూర్తి సమాచారాన్ని అప్‌లోడ్ చేస్తున్నారు. ఇందులో మహిళా ఏఈవోలు 1,800 ఎకరాలు, పురుష ఏఈవోలు 2వేల ఎకరాల్లోని పంటల వివరాలు నమోదు చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. జిల్లావ్యాప్తంగా వరి 1,14,638 ఎకరాలు, పత్తి 1,26,075, సోయాబీన్ 1,07,052, మొక్కజొన్న 12,835, కంది 5,719, పెసర 52, మినుము 59 ఎకరాలకు సంబంధించి పంటల నమోదు పూర్తి చేశారు.

రైతులకు కలిగే ప్రయోజనాలు

- గతంలో రైతులు సాగు చేసిన పంటల వివరాల లెక్క పక్కాగా లేకపోవడంతో దిగుబడులు విక్రయించేటపుడు ఇబ్బందులెదురయ్యేవి. ప్రస్తుత డిజిటల్ క్రాప్ బుకింగ్‌తో అలాంటి ఇబ్బందులకు తావుండదు.
- ప్రకృతి వైపరీత్యాలు సంభవించినపుడు నష్టపోయిన పంటల వివరాలు కచ్చితంగా తెలుసుకునే అవకాశముంటుంది.
- గతంలో దళారులు రైతుల నుంచి తక్కువ ధరకు పంట దిగుబడులు కొని మద్దతు ధరకు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో రైతుల పేరిట విక్రయించిన ఘటనలున్నాయి. వీటికి చెక్ పెట్టడానికి పంటల నమోదు ఉపయోగకరంగా ఉంటుంది.

ఇప్పటికే 95శాతం పూర్తి



వ్యవసాయశాఖ ఆదేశాలతో జిల్లాలో చేపట్టిన పంటల వివరాల నమోదు 95శాతం పూర్తయింది. మిగతా ఐదు శాతం త్వరగా పూర్తి చేస్తాం.

– అంజిప్రసాద్, డీఏవో

గూడేల్లో సంబురంగా దండారీ



ఖానాపూర్: కోలాటమాడుతున్న ఆదివాసీలు



ఖానాపూర్: గుస్సాడీ నృత్యం చేస్తున్న ఆదివాసీలు

ఖానాపూర్: దీపావళికి ముందు సంప్రదాయ ఉత్సవాల్లో ఒక్కటైన దండారీ ఉత్సవాలను ఆదివాసీలు అత్యంత భక్తి శ్రద్ధలతో జరుపుకొన్నారు. ఆదివారం మండలంలోని పలు గ్రామాల్లో ఎత్మసార్, చాచోయి, సబాయి, పేన్ తదితర ఆదివాసీ దేవుళ్లకు పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గుస్సాడీ నృత్యాలు చేశారు. మహిళలు రేలారేలా నృత్యాలు చేస్తూ, పురుషులు కోలాటం ఆడుతూ వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. అడవి సారంగాపూర్, జిల్లెడుకుంట గ్రామాల్లో శనివారం రాత్రి, ఆదివారం రోజంతా ప్రత్యేక పూజలు చేశారు. పెంబి మండలం వస్‌పల్లి కొత్తగూడేనికి చెందిన ఆదివాసీలు అడవి సారంగాపూర్‌లో నిర్వహించిన ఉత్సవాలకు హాజరయ్యారు. సింగాపూర్ గోండుగూడకు చెందిన ఆదివాసీలు జిల్లెడుకుంట గ్రామానికి చేరుకుని ఉత్సవాలు నిర్వహించారు. అనంతరం దేవుళ్ల వద్ద భేటీలు, పూజలు చేశారు. ఈ సందర్భంగా గుస్సాడీ వేషధారణలో చేసిన నృత్యాలు అందరినీ అలరించాయి. వేర్వేరుగా జరిగిన కార్యక్రమాల్లో భీంరావు పటేల్, అంకుశ్‌రావు పటేల్, ఆడె గంగారాం, ఆత్రం రాజేశ్వర్, శంభు, బీర్షావ్, దేవరావు, బారిక్‌రావు, అర్జున్ పటేల్, పెందూర్ బొజ్జు, శ్యాంరావు, మాధవ్ తదితరులు పాల్గొన్నారు.

కడెం: మండలంలోని మైసంపేట్, చిట్యాల్, ఇస్లాంపూర్, దోస్తినగర్ తదితర ఆదివాసీ గూడేల్లో దండారీ సంబురాలు కొనసాగుతున్నాయి. ఆదివారం మైసంపేట్ ఆదివాసీలు మండలకేంద్రంలోని కుమురంభీం విగ్రహం వద్ద ప్రత్యేక పూజలు చేశారు.



కడెం: భీంకు పూజలు చేస్తున్న ఆదివాసీలు



ఖానాపూర్: రేలారేలా నృత్యం చేస్తున్న మహిళలు

ముధోల్‌లో ఆర్‌ఎస్‌ఎస్ పథ సంచాలన్



పథ సంచాలన్‌లో స్వయం సేవకులు

ముధోల్: ఆర్‌ఎస్‌ఎస్ వందేళ్ల స్థాపన ఉత్సవాల్లో భాగంగా మండలకేంద్రంలోని శ్రీసరస్వతి శిశుమందిర్‌లో ఆదివారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ప్రధాన వక్తగా ఇందూర్ విభాగ్ ప్రచార ప్రముఖ్ వారే దస్తగిరి ప్రసంగించారు. ముందుగా గ్రామంలో పథ సంచాలన్ నిర్వహించారు. సారథి రమేశ్, గ్రామస్తులు, స్వయం సేవకులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రాష్ట్రస్థాయి స్విమ్మింగ్ పోటీల్లో సత్తా

ఆదిలాబాద్: రాష్ట్రస్థాయి స్విమ్మింగ్ పోటీల్లో జిల్లాకు చెందిన కొమ్ము కృష్ణ సత్తా చాటాడు. హైదరాబాద్‌లోని అంబర్‌పేటలో ఆదివారం నిర్వహించిన పదవ తెలంగాణ మాస్టర్ ఇంటర్ డిస్ట్రిక్ట్ స్విమ్మింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో 100 మీటర్స్ బ్రెస్ట్ స్ట్రోక్ ఈవెంట్లో గోల్డ్ మెడల్‌తో మెరిశాడు. రాష్ట్రస్థాయి పోటీల్లో విజేతగా నిలవడంపై డీవైఎస్‌ఓ జక్కుల శ్రీనివాస్, జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బాలూరి గోవర్ధన్‌రెడ్డి, పార్థసారథి తదితరులు అభినందించారు.

ఆలయంలో కుంభాభిషేక మహోత్సవం



ప్రవచనాలు ఇస్తున్న విదుశేఖర భారతి స్వామి

బాసర: బాసరలోని లలిత చంద్రమౌళీశ్వర ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన కుంభాభిషేక మహోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. శృంగేరి పీఠాధిపతి విదుశేఖర భారతిస్వామి హాజరై 12 జ్యోతిర్లింగాలు స్ఫటికలింగం ప్రాణప్రతిష్ఠను చేపట్టారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముధోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్, నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్పాల్ సూర్యనారాయణ గుప్తాలు అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం శ్రీ జ్ఞాన సరస్వతి ఆలయంలో పూజలు చేశారు.

ఖండాంతరాలు దాటిన నృత్య ప్రదర్శన



రవీంద్రభారతిలో అనూష కళాప్రదర్శన (ఫైల్)

కుభీర్: మండల కేంద్రానికి చెందిన కళాకారిణి ఠాకూర్ అనూష భరతనాట్య నృత్య ప్రదర్శన ఖండాంతరాలకు దాటింది. ఈమె తల్లిదండ్రులు మీరా–కరణ్‌సింగ్. తల్లి గృహిణి. తండ్రి ఆర్టీసీ డ్రైవర్‌గా పనిచేసి ఉద్యోగ విరమణ పొందారు. అనూషకు చిన్నప్పటి నుంచి పాటలు పాడటం(జానపద) డ్యాన్స్ చేయడం చాలా ఇష్టం. ఎంఏ ఇంగ్లిష్ విద్యనభ్యసించగా, ఆమె భరతనాట్యంలో డిప్లొమా పూర్తిచేసింది. 2008లో మా టీవీలో వచ్చిన రేలారేలా కార్యక్రమంలో పాల్గొని జానపద పాటలు పాడారు. గురువు సముద్రాల మాధవీ రామానుజం వద్ద భరతనాట్యంలో మెలకవలు నేర్చుకుంది. ఢిల్లీ, ముంబయి, హైదరాబాద్, బెంగళూరు, భద్రాచలం, తిరుమల తదితర నగరాల్లో 400లకు పైగా, అమెరికా, యూకే, మలేషియా దేశాల్లో ప్రదర్శనలు ఇచ్చింది. తండ్రి ఆదిలాబాద్‌లో పనిచేయడంతో ఆమె విద్యాభ్యాసం అక్కడే సాగింది. దేశ,విదేశాల్లో భరతనాట్య ప్రదర్శన చేసిన ఆమె ఎక్కడికెళ్లిన కుభీర్ వాసిగా చెబుతోంది.

చెదరని నెత్తుటి జ్ఞాపకాలు

- నాటి నక్సలైట్ల దాడుల్లో 19 మంది పోలీసుల దుర్మరణం
- అమరుల కుటుంబాల్లో తీరని శోకం
- రేపు పోలీసు అమరవీరుల సంస్మరణ దినం



ఖానాపూర్ సర్కిల్ పోలీస్ స్టేషన్‌లో పోలీసు అమరవీరుల స్మారక స్తూపం

ఖానాపూర్: ఉమ్మడి రాష్ట్రంలోని ఆదిలాబాద్ జిల్లాకు నేటికి చెదరని నెత్తుటి చేదు జ్ఞాపకాలు.. అప్పటి పరిస్థితులు తలుచుకుంటేనే ఒళ్లు జలదరిస్తుంది. ఎటుచూసినా అన్నల అలజడి.. తుపాకీ మోత చప్పుళ్లు వినబడుతుండేవి. ప్రతీరోజు ఎక్కడో ఒకచోట నక్సలైట్ల విధ్వంసాలు, తరచూ ఎన్‌కౌంటర్లు జరుగుతుండేవి. వారి కవ్వింపు చర్యలను తిప్పికొట్టే ప్రయత్నాల్లో పలువురు పోలీసులు అమరులయ్యారు. వారి సేవలు మరువలేనివి. ఈక్రమంలోనే ఎన్నో సంఘటనలు జరిగాయి. 1983 నుంచి అప్పటి ఆదిలాబాద్‌లో ఉన్న నిర్మల్ జిల్లా పరిధిలో నక్సలైట్ల ప్రభావం పెరుగుతూ వచ్చింది. ఖానాపూర్ ప్రాంతంలో దట్టమైన అడవులు ఉండడంతో స్థావరాలు ఏర్పాటు చేసుకుని ఇక్కడి నుంచే కార్యకలాపాలు నడిపేవారు. జిల్లాలో మొదటిసారిగా ఇక్కడి నుంచే విద్రోహచర్యలకు శ్రీకారం చుట్టారు. ఈ క్రమంలో ఖానాపూర్ సర్కిల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో విధి నిర్వహణలో ఉన్న 19 మంది పోలీసులు నక్సలైట్ల తూటాలకు బలయ్యారు. వారి కుటుంబాల్లో తీరని శోకం మిగిల్చింది. ఈనెల 21 పోలీసు అమరవీరుల సంస్మరణ దినం సందర్భంగా సాక్షి కథనం.

ఉమ్మడి రాష్ట్రంలోని ఆదిలాబాద్ జిల్లాకు నేటికి చెదరని నెత్తుటి చేదు జ్ఞాపకాలు.. అప్పటి పరిస్థితులు తలుచుకుంటేనే ఒళ్లు జలదరిస్తుంది. ఎటుచూసినా అన్నల అలజడి.. తుపాకీ మోత చప్పుళ్లు వినబడుతుండేవి. ప్రతీరోజు ఎక్కడో ఒకచోట నక్సలైట్ల విధ్వంసాలు, తరచూ ఎన్‌కౌంటర్లు జరుగుతుండేవి. వారి కవ్వింపు చర్యలను తిప్పికొట్టే ప్రయత్నాల్లో పలువురు పోలీసులు అమరులయ్యారు. వారి సేవలు మరువలేనివి. ఈక్రమంలోనే ఎన్నో సంఘటనలు జరిగాయి. 1983 నుంచి అప్పటి ఆదిలాబాద్‌లో ఉన్న నిర్మల్ జిల్లా పరిధిలో మెల్లమెల్లగా నక్సలైట్ల ప్రభావం పెరుగుతూ వచ్చింది. ఖానాపూర్ సర్కిల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో విధి నిర్వహణలో నక్సలైట్ల తూటాలకు 19 మంది పోలీసులు బలయ్యారు. ఖానాపూర్ ప్రాంతంలో దట్టమైన అడవులు ఉండడంతో నక్సలైట్లు స్థావరాలు ఏర్పాటు చేసుకుని ఇక్కడి నుంచే కార్యకలాపాలు నడిపేవారు. జిల్లాలో మొదటిసారిగా ఇక్కడి నుంచే నక్సలైట్లు విద్రోహచర్యలకు శ్రీకారం చుట్టారు.

ఖానాపూర్‌లో అమరుల స్తూపం

ఖానాపూర్ పోలీస్‌స్టేషన్‌లో పోలీసు అమవీరుల స్మారకార్థం స్తూపం లేదు. పోలీస్‌స్టేషన్ ఆవరణలో వేపచెట్టు కింద కొన్నేళ్లుగా శిలాఫలకంపై పేర్లు రాసి ఉంచారు. 2008లో అప్పటి సీఐ, ఎస్సైలు స్మారక స్తూప నిర్మాణానికి కృషిచేశారు. ప్రస్తుత సీఐ అజయ్‌తోపాటు ఎస్సై రాహుల్ గైక్వాడ్ వివిధ కార్యక్రమాలు చేపడుతున్నారు.

సంఘటనల వివరాలివే..

- 1987 ఆగస్టు 18న కడెం మండలం అల్లంపల్లి క్యాంపునకు పోలీసులు నడిచివెళ్తుండగా అద్దాల తిమ్మాపూర్ వద్ద 30 మంది నక్సలైట్లు పకడ్బందీ పథకం ప్రకారం మాటువేసి విచక్షణరహితంగా కాల్పులు జరిపారు. ఇద్దరు ఎస్సైలు, హెడ్‌కానిస్టేబుల్, ఏడుగురు కానిస్టేబుళ్ల ప్రాణాలు కోల్పోయారు. మరో ఐదుగురు కానిస్టేబుళ్లు తప్పించుకొని ప్రాణాలు కాపాడుకున్నారు. గంధం రామస్వామి ఉరఫ్ సాగర్ అనే దళ కమాండర్ నేతృత్వంలో ఈ దాడి జరిగింది. ఘటన స్థలాన్ని అప్పటి సీఎం ఎన్టీఆర్ పరిశీలించారు. జిల్లాను ఆదర్శ జిల్లాగా ప్రకటించి గిరిజనులకు ఉద్యోగావకాశాలు కల్పించేందుకు చర్యలు చేపట్టారు.
- 1989 ఫిబ్రవరి 1న జరిగిన సంఘటనకు ఒక రోజు ముందు ఖానాపూర్ మండలం రాజూరా గ్రామంలో నక్సలైట్లు దోపిడీకి పాల్పడ్డారు. పోలీసులు ఆ గ్రామానికి వెళ్తుండగా కడెం మండలం సింగాపూర్ సమీపంలో పకడ్బందీ వ్యూహంతో నక్సలైట్లు పోలీసుల జీపును పే ల్చివేశారు. ఎస్సై ఖాదర్‌ఉల్‌హక్, ఆరుగురు కానిస్టేబుళ్లు జి.బాపురావు, ఎండీ జలీల్, శేక్ హైదర్, వేణుగోపాల్, భోజారావు,ఎస్.మోహన్‌దాస్ ప్రాణాలు కోల్పోయారు. ఒకే కాని స్టేబుల్ ప్రాణాలతో బయటపడ్డాడు.
- 1999 డిసెంబర్ 5న కడెం మండలంలో బందోబస్తుకు వెళ్లి పోలీసులు వస్తుండగా ఖానాపూర్ మండలం తర్లపాడ్ గ్రామసమీపంలో నక్సలైట్లు రిమోట్‌కంట్రోలర్ సాయంతో పోలీసులు వెలుతున్న ప్రై వేటు జీపును పేల్చివేశారు. అందులో ప్రయాణిస్తున్న ఎస్సై మల్లేశ్‌తో పాటు కానిస్టేబుల్, ప్రై జీపు డ్రై వర్ దుర్మరణం చెందారు.

బలవంతపు పెళ్లికి యత్నం

- 1098కి ఫోన్ చేసిన బాలిక
- తల్లిదండ్రులకు కౌన్సెలింగ్

ఆదిలాబాద్‌రూరల్: బాలికకు బలవంతంగా పెళ్లి చేసేందుకు తల్లిదండ్రులు యత్నిస్తున్న ఘటన మావల పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. కాలనీకి చెందిన బాలిక(17) ఆదివారం చైల్డ్ హెల్ప్ లైన్ 1098కు ఫోన్ చేసింది. తల్లిదండ్రులు చిన్న వయస్సులో ఇష్టం లేని పెళ్లి చేస్తున్నారని కాపాడాలని వేడుకుంది. వెంటనే స్పందించిన చైల్డ్‌లైన్ సూపర్‌వైజర్ అనిల్, ష్యూర్ ఎన్జీవో జిల్లా కోఆర్డినేటర్ కె.వినోద్, షీటీమ్ కానిస్టేబుల్ మహేశ్, మావల పోలీస్ కానిస్టేబుళ్లతో కలిసి బాలిక ఇంటికి వెళ్లారు. బాల్యవివాహంతో జరిగే అనర్థాలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. వారికి కౌన్సెలింగ్ ఇచ్చారు. మేజర్ తర్వాతే ఆమెకు ఇష్టం ఉన్నవ్యక్తితో పెళ్లి జరిపిస్తామని ఒప్పందపత్రం రాసి ఇచ్చారు. జిల్లా బాలల సంరక్షణ అధికారి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ బాలికను బాల సదనానికి తరలించి తాత్కాలికంగా వసతి కల్పిస్తున్నామని తెలిపారు.

పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య



శేఖర్ (ఫైల్)

లక్ష్మణచాంద: అనారోగ్యంతో బాధపడుతున్న వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని పీచర గ్రామానికి చెందిన నైనం శేఖర్ (28) గత కొన్నిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈక్రమంలో జీవితంపై విరక్తి చెందాడు. శనివారం ఉదయం గ్రామసమీపంలో గుర్తుతెలియని పురుగుల మందు తాగాడు. గమనించిన గ్రామస్తులు అందించిన సమాచారంతో కుటుంబ సభ్యులు అతన్ని నిర్మల్‌కు తరలించారు. చికిత్సపొందుతూ ఆదివారం మృతి చెందాడు. మృతుడి భార్య నాగలక్ష్మి ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీనివాస్ తెలిపారు. మృతుడికి ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు.

అన్వేషిక ప్రయోగదర్శిని రూపకల్పనలో టీచర్



సత్యనారాయణ

జైనథ్: ఎస్‌సీఈఆర్టీ వారు రూపొందించిన అన్వేషిక ప్రయోగదర్శిని రూపకల్పనలో జిల్లా ఉపాధ్యాయుడికి చోటు లభించింది. మండల కేంద్రంలోని మోడల్ స్కూల్ ఉపాధ్యాయుడు గోసుల సత్యనారాయణ 6వ తరగతి పాఠ్యాంశంలోని ప్రయోగ కృత్యాలను పుస్తకంలో పొందుపర్చారు. రాష్ట్ర వ్యాప్తంగా 32 మంది సబ్జెక్ట్ ఉపాధ్యాయులు పాల్గొనగా, ఆదిలాబాద్ జిల్లా నుంచి ఈయన పాల్గొన్నారు. విద్యార్థుల్లో శాస్త్రీయ జ్ఞానం, విలువలు పెంపొందించడంతోపాటు ప్రయోగకృత్యాలను పుస్తకంలో పొందుపర్చినట్లు తెలిపారు. ఈ అంశాలు ఉపాధ్యాయులతోపాటు విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడతాయని ఆయన వివరించారు.

సాత్నాల ప్రాజెక్టులో దూకి ఒకరి ఆత్మహత్య



పవర్ బాలాజీ మృతదేహం

సాత్నాల: మండలంలోని సాత్నాల ప్రాజెక్టులో ఆదివారం ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన స్థానికంగా కలకలం రేపింది. ఎస్సై గౌతమ్‌పవార్ తెలిపిన వివరాల ప్రకారం.. ఇంద్రవెల్లి గ్రామానికి చెందిన, పవార్ బాలాజీ(37) ఆరు నెలల క్రితం, ఉపాధి కో సం సాత్నాల మండలం రామయికి వలస వచ్చాడు. సీస కమ్మరిగా, చికెన్ సెంటర్లో పనిచేస్తూ జీవనం కొ నసాగిస్తున్నారు. మద్యానికి బానిసైన బాలాజీ శని వారం రాత్రి భార్య, అత్తతో గొడవ పడ్డాడు. బామ్మర్దులు వారించారు. ఆదివారం ఉదయం పనికి వెళుతున్నానని చెప్పి, సాత్నాల ప్రాజెక్టులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. బాలాజీ తమ్ముడు సంజయ్ ఇచ్చి న ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై గౌతమ్‌పవార్ తెలిపారు.

జన్నారం అందాలు చూసొద్దాం..



హరిత రిసార్ట్‌లో హైదరాబాద్ పర్యాటకులు

- వన్యప్రాణులు, పక్షులు ఇలా
- మొదలైన జంగిల్ సఫారీ
- పెరిగిన పర్యాటకులు
- వీకెండ్‌లో గదులు ఫుల్

జన్నారం: జన్నారం అటవీ డివిజన్‌లో అందాలు అస్వాదిస్తూ.. వన్యప్రాణులు, రకరకాల పక్షులు, జంగిల్ సఫారీ ప్రయాణం ద్వారా వీక్షించేందుకు అటవీశాఖ అనుమతి ఇచ్చింది. వర్షాలు తగ్గుముఖం పట్టడడంతో సఫారీ ప్రయాణానికి గ్రీన్‌సిగ్నల్ లభించింది. మూడు నెలల విరామం తర్వాత అక్టోబర్ 1 నుంచి జంగిల్ సఫారీ మొదలైంది. వివిధ ప్రాంతాల నుంచి పర్యాటకులు ఇక్కడకు వచ్చి పచ్చని అడవులు చూసి మురిసిపోతున్నారు. పచ్చదనం, స్వచ్ఛమైన వాతావరణం మధ్య గడుపుతున్నారు. వీకెండ్ రోజుల్లో గదులు ఫుల్‌గా ఉంటున్నాయని పర్యాటక అధికారులు పేర్కొంటున్నారు.

15 రోజుల్లో 600 పైగా మంది

జంగిల్ సఫారీ మొదలైన 15 రోజుల్లో తెలంగాణ, మహారాష్ట్ర, ఇతర రాష్ట్రాల నుంచి సుమారు 600 పైగా మంది పర్యాటకులు ఇక్కడకు వచ్చారని అధికారులు తెలిపారు. నిజామాబాద్, హైదరాబాద్ నుంచి బస్సుల్లో వచ్చి ఇక్కడ సందడి చేస్తున్నారు. రాత్రి హరిత రిసార్ట్‌లో బస చేసి ఉదయం జంగిల్ సఫారీ ద్వారా వన్యప్రాణుల పరుగులు, పచ్చని అడవులను అస్వాదిస్తున్నారు. అటవీశాఖ ఏర్పాటు చేసిన బేస్‌క్యాంపు, అధ్యయన కేంద్రాలను పరిశీలిస్తున్నారు. అడవుల్లో నిర్మించిన కుంటల్లో పక్షుల కిలకిలలు చూసి మురిసిపోతున్నారు. తెల్లవారు జామున, సూర్యకిరణాలు, చెట్ల మధ్యన పడటం ఆహ్లాదం పంచుతుంది.



అడవిలో పర్యాటకులు

చెడిపోయిన దారులు..

గేట్ నంబర్ 1 నుంచి సుమారు 15 కి.మీ దూరం సఫారీ ప్రయాణం ఉంటుంది. గొండుగూడ బేస్‌క్యాంపు, బైసన్‌కుంట ప్రాంతాల్లో చుక్కల దుప్పులు, నీలుగాయిలు, అడవి దున్నలు, రకరకాల పక్షులు ఎక్కువగా కనిపిస్తాయి. ఇటీవల కురిసిన వర్షాలకు పలు ప్రాంతాల్లో సఫారీ దారి చెడిపోయినట్లు పర్యాటకులు పేర్కొంటున్నారు. అటవీశాఖ దృష్టిసారించి సఫారీ దారిని బాగు చేయిస్తే బాగుంటుందని అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. సౌకర్యాలు సైతం కల్పించాలని కోరుతున్నారు.

పర్యాటకుల సంఖ్య పెరిగింది



సఫారీ మొదలై 15 రోజుల్లోనే పర్యాటకుల సంఖ్య పెరిగింది. వీకెండ్‌లో గదులు నిండిపోతున్నాయి. ఆన్‌లైన్‌లోనే బుకింగ్ చేసుకుంటున్నారు. హైదరాబాద్, వరంగల్, నిజామాబాద్ నుంచి చాలామంది వస్తున్నారు.

– వీరేందర్, హరిత మేనేజర్

రెండోసారి వచ్చాను



జన్నారం అడవులకు రావ డం ఇది రెండో సారి. ఇక్కడ అందాలు చాలా బాగుంటుంది. సఫారీలో వెళ్లేట ప్పుడు చుక్కలు దుప్పులు, నీలుగాయి పరుగులు కనువిందు చేస్తాయి. మా గ్రూప్ సభ్యులందరూ వాటిని చూసి మురిసిపోయారు. అక్కడక్కడ సఫారీ దారిలో మట్టి పోయించాలి.

– వినీత, హైదరాబాద్

17 రకాల పక్షులను గుర్తించాను



సఫారీ ప్రయాణంలో వివిధ రకాల పక్షులు కనిపించాయి. ఇందులో విదేశీ పక్షులు ఉన్నాయి. బైసన్‌కుంట ప్రాంతంలో 17 రకాల పక్షులను గుర్తించాను. ఫొటోలు కూడా తీశాను. బైసన్‌కుంటలో పక్షులు అవాసం ఏర్పాటు చేసుకున్నాయి. అడవులు చాలా బాగున్నాయి.

– సంకలిత దేలినాథ్

‘పీవీటీజీల అభివృద్ధిపై నిర్లక్ష్యం’



నినాదాలు చేస్తున్న ఆదివాసీ సంఘాల నేతలు

బేల: గిరిజన గ్రామాల పీవీటీజీల అభివృద్ధి, సంక్షేమంపై అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆదిమ గిరిజన కొలాం సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొడప సొనేరావ్ ఆరోపించారు. మండలంలోని సదల్‌పూర్ గ్రామంలో ఆదివారం నిర్వహించిన కుంరం సూరు, కుమురం భీం వర్ధంతికి ఆయన హాజరయ్యారు. పోరాటయోధుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాని మోదీ గతేడాది దేశంలోని పీవీటీజీల అభివృద్ధి, సంక్షేమం కోసం రూ. 24వేల కోట్లు మంజూరు చేశారని గుర్తుచేశారు. అందులో భాగంగా తెలంగాణలో రూ. 24 కోట్లు, ఆదిలాబాద్ జిల్లాలోని ఉట్నూర్ ఐటీడీఏకు నిధులు కేటాయించారని తెలిపారు. పీవీటీజీలకు రూ. 60 లక్షలతో మల్టీహాల్ నిర్మించాల్సి ఉండగా కేవలం రూ.45 లక్షలతో నిర్మాణాలు చేపడుతున్నారని విమర్శించారు. అంచనా వ్యయం తగ్గించడంలో అంతరాయం ఏముందని ప్రశ్నించారు. అనంతరం ఇటీవల రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికైనా కొడప సొనేరావ్‌ను గ్రామస్తులు సన్మానించారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కుమ్ర రాజు, జిల్లా అధ్యక్షుడు మడావి గోవింద్‌రావ్, డివిజన్ అధ్యక్షుడు టేకం గణేష్, ఆదిలాబాద్ రూరల్ మండల అధ్యక్షుడు కుమ్ర జలపత్‌రావ్, బేల మండల అధ్యక్షుడు కొడప జైవంత్, గ్రామ మాజీ సర్పంచ్ రాందాస్, ఆదివాసీ సీనియర్ నాయకుడు మడావి జంగు తదితరులు పాల్గొన్నారు.

నిలకడగా ‘కడెం’నీటిమట్టం



కడెం: కడెం ప్రాజెక్ట్ నీటిమట్టం నిలకడగా కొనసాగుతోంది. పూర్తిస్థాయి నీటిమట్టం 700 అడుగులు కాగా, ఆదివారం 700 అడుగులుగా ఉంది. ప్రస్తుతం ప్రాజెక్ట్‌కు 800 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో స్వల్పంగా వస్తున్నట్లు ఇరిగేషన్ అధికారులు వెల్లడించారు.

బోటు షికారు



కడెం: కడెం ప్రాజెక్ట్ వద్ద ఆదివారం పర్యాటకుల సందడి కనిపించింది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చి బోటింగ్ చేశారు. వారు ఉల్లాసంగా, ఉత్సాహంగా గడిపారు.